# 19224 వద్ద తక్షణ నిరోధం




రెండు వారాల పాటు బాగా పడిపోయిన మార్కెట్ గతవారం అధిక ఊగిసలాటకు గురైంది. 147 పాయింట్ల స్వల్ప లాభంతో 19007 వద్ద సెన్సెక్స్ ముగిసింది. ప్రారంభంలో తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్లపై ఆసక్తి కనిపించింది. అయితే అంతర్లీనంగా ఉన్న బలహీనతలు వారమంతా కనిపించాయి. మెరుగైన ఆర్థిక ఫలితాలకు తోడుగా ప్రధాన కంపెనీల్లో కొనుగోళ్లు పెరగడంతో సెన్సెక్స్ 19000 స్థాయికి తిరిగి చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల పవనాల నేపథ్యంలో 19167 వద్ద గరిష్ఠాన్ని చేరింది. అయితే విదేశీ సంస్థాగత మదుపుదార్ల(ఎఫ్ఐఐ) వరుస విక్రయాలు మార్కెట్‌ను ఎక్కువ స్థాయిల వైపు వెళ్లకుండా అడ్డుకున్నాయి. రిజర్వ్ బ్యాంకు రేట్లు పెంచుతుందన్న భయాలు మార్కెట్‌లో కనిపించాయి. ఎఫ్ఐఐలు రూ.1618 కోట్ల నికర విక్రయాలు చేశారు. ఫండ్లు రూ.198 కోట్ల నికర కొనుగోళ్లు జరిపాయి.

**రంగాల వారీగా:** ముఖ్యంగా ప్రధాన కంపెనీల ఫలితాలు మెరుగ్గా ఉండడంతో బ్యాంకింగ్, ఐటీ రంగాలలో తక్కువ స్థాయిలో కొనుగోళ్లు కనిపించాయి. అంతర్జాతీయ లోహ ధరలు పెరగడంతో లోహ సూచీ సైతం రాణించింది. చమురు-సహజవాయువు, యంత్ర పరికరాలు, ఎఫ్ఎమ్‌సీజీ సూచీలకు విక్రయ ఒత్తిళ్లు ఎదురయ్యాయి.

శుక్రవారం నాటికి లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదు కావడం మార్కెట్లో కొనుగోళ్లపై ఆసక్తి అంతటా ఆవరించలేదని స్పష్టమవుతోంది.

**ఈ వారంపై అంచనాలు:** రెండు వారాల నష్టాల తర్వాత మార్కెట్ స్వల్ప లాభాన్ని పొంది 200 రోజుల చలన సగటు 18702 పైన ముగిసింది. మధ్యకాలిక అధోగమనంలో ఉన్న సెన్సెక్స్ వచ్చే కొద్ది వారాలు/నెలల్లో 18000 స్థాయిని పరీక్షించవచ్చు. అయితే 19224 పైన మార్కెట్ ముగిస్తే మాత్రం స్వల్పకాల రికవరీని ఆశించొచ్చు.

**ప్రభావితం చేసే అంశాలు:** 25న జరగబోయే రిజర్వ్ బ్యాంకు పరపతి సమీక్ష సమావేశం కీలకం కానుంది. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి అదే సమయంలో వృద్ధిని సమతులనం చేయడానికి చేపట్టే ఎలాంటి చర్యనైనా అయినా మార్కెట్ అనుకూలంగా తీసుకోవచ్చు. అయితే వడ్డీ రేట్లలో ఎలాంటి అధిక పెంపు ఉన్నా ప్రతికూల ప్రభావం పడుతుంది. 27న విడుదలయ్యే ఆహార ద్రవ్యోల్బణ గణాంకాలూ ప్రభావం చూపనున్నాయి. డెరివేటివ్‌ల గడువు గురువారంతో తీరనుండడంతో ఊగిసలాట పెరగవచ్చు. త్రైమాసిక ఫలితాల కారణంగా ఎంపిక చేసిన షేర్లలో కదలికలు ఎక్కువగా కనిపించవచ్చు. ఎఫ్ఐఐల విక్రయాల తీరు ఇలాగే ఉంటే మార్కెట్ మరింత పడొచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 19224, 19376, 19575; **తక్షణ మద్దతు స్థాయిలు:** 18779, 18475, 18027

**స్వల్పకాలంలో 19224 తక్షణ నిరోధ స్థాయిగా ఉండగలదు.**

*– సతీశ్ కంతేటి, జెన్ మనీ*